www.aksharadarbar.com
శనివారం 08, జూన్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంపుటి :02 | సంచిక :107 | పేజీలు : 04 | వెల : 05

సీడబ్ల్యూసీ సమావేశాలకు రేవంత్ రెడ్డి

అక్షర దర్బార్, హైదరాబాద్: సీడబ్ల్యూసీ సమావేశాలకు హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని సీఎం మర్యాద పూర్వకంగా కలిశారు.

నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు

కలెక్టర్ అద్వైత్ కుమార్ | 03

సాగునీటికి ప్రణాళిక

భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు మరో తీపి కబురు. ఇప్పటికే కొద్ది నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ ప్రాజెక్టులను పొందిన ఈ నియోజకవర్గంలో తాజాగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది. ఇప్పటివరకు ఏ ప్రాజెక్టు ద్వారా కూడా కవర్ కాకుండా మిగిలిపోయిన గ్యాప్ ఆయకట్టుతో పాటు కాలువలు ఉన్నా సాగునీటికి నోచుకోలేకపోతున్న ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు జె చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నీరందించే కసరత్తు యుద్ధప్రాతిపదికన జరుగుతోంది. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో సుమారు రూ.640 కోట్ల అంచనాతో రెండు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఇరిగేషన్ ఇంజినీర్లు రామప్ప బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా ఎస్సారెస్పీ డీబీఎం- 38 కాలువ పరిధిలోని సుమారు 44 వేలకు పైగా ఎకరాల చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడానికి రూ.290 కోట్లతో లైన్ ఎస్టిమేట్ రూపొందించారు. దీంతోపాటు గణపతి సముద్రం నుంచి గ్రావిటీ ద్వారా సుమారు 30 వేలకు ఎకరాలకు పైగా గ్యాప్ ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు సుమారు రూ.350 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ఈ ప్రతిపాదనల అమలుకు ఆమోద ముద్ర వేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు తెలిసింది. ఈ రెండు ప్రాజెక్టులు కార్యరూపం దాలిస్తే సుమారు 75 వేలకు పైగా ఎకరాల ఆయకట్టుకు దేవాదుల నీరు అందనుంది.

| 02

- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

- సుమారు 75 వేల ఎకరాలకు 'దేవాదుల' నీరందించడానికి నిర్ణయం
- రామప్ప నుంచి ఎత్తిపోతలకు రూ.290 కోట్లతో ఎస్టిమేట్స్
- గణపసముద్రం నుంచి గ్రావిటీ కోసం రూ.350 కోట్లతో అంచనాలు
- ఆమోద ముద్ర వేసేందుకు సీఎం సానుకూలత
- భూపాలపల్లి నియోజకవర్గంలోని గ్యాప్, ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు అందనున్న నీరు

ఎమ్మెల్యే జీఎస్సార్ చొరవతో సిద్ధమైన డీపీఆర్ లు

రామోజీ రావు అస్తమయం

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతిచెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్ లోని స్టార్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం తెల్లవారుజామున 3:45 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. ఈనెల 5న గుండె సమస్యలతో ఆయనకు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. దీంతో హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం గుండెకు స్టెంట్ వేశారు. అనంతరం ఐసీయూలో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్సపొందుతూ మృతిచెందారు. ఆయన పార్థివ దేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. 1936 నవంబర్ 16న ఏపీలోని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో రామోజీరావు జన్మించారు. 1974 ఆగస్టు 10న విశాఖ తీరంలో 'ఈనాడు' దినపత్రికను ప్రారంభించారు. రామోజీరావుకు సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖుల నివాళులు అర్పించారు.

- అక్షర దర్బార్, హైదరాబాద్

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు
- అధికార లాంఛనాలతో ఆదివారం అంత్యక్రియలు

03



అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠా అరెస్టు

192 కిలోల గంజాయి పట్టివేత | 03

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

సాగునీటికి ప్రణాళిక

- సుమారు 75 వేల ఎకరాలకు 'దేవాదుల' నీరందించడానికి నిర్ణయం
- రామప్ప నుంచి ఎత్తిపోతలకు రూ.290 కోట్లతో ఎస్టిమేట్స్
- గణపసముద్రం నుంచి గ్రావిటీ కోసం రూ.350 కోట్లతో అంచనాలు
- ఆమోదముద్ర వేసేందుకు సీఎం సానుకూలత
- భూపాలపల్లి నియోజకవర్గంలోని గ్యాప్, ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు అందనున్న నీరు
- **ఎమ్మెల్యే జీఎస్సార్ చొరవతో సిద్ధమైన డీపీఆర్ లు**

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు మరో తీపి కబురు. ఇప్పటికే కొద్ది నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివిధ ప్రాజెక్టులను పొందిన ఈ నియోజకవర్గంలో తాజాగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది. ఇప్పటివరకు ఏ ప్రాజెక్టు ద్వారా కూడా కవర్ కాకుండా మిగిలిపోయిన గ్యాప్ ఆయకట్టుతో పాటు కాలువలు ఉన్నా సాగునీటికి నోచుకోలేకపోతున్న ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు జె చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నీరందించే కసరత్తు యుద్ధప్రాతిపదికన జరుగుతుంది. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చొరవతో సుమారు రూ.640 కోట్ల అంచనాతో రెండు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇందులో భాగంగా ఇరిగేషన్ ఇంజనీర్లు రామప్ప బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా ఎస్సారెస్పీ డీబీఎం-38 కాలువ పరిధిలోని సుమారు 44 వేలకు పైగా ఎకరాల చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడానికి రూ.290 కోట్లతో లైన్ ఎస్టిమేట్ రూపొందించారు. దీంతోపాటు గణపసముద్రం నుంచి గ్రావిటీ ద్వారా సుమారు 30 వేలకు ఎకరాలకు పైగా గ్యాప్ ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు సుమారు రూ.350 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ఈ ప్రతిపాదనల అమలుకు ఆమోదముద్ర వేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నట్లు తెలిసింది. ఈ రెండు ప్రాజెక్టులు కార్యరూపం దాలిస్తే సుమారు 75 వేలకు పైగా ఎకరాల ఆయకట్టుకు దేవాదుల నీరు అందనుంది.

రామప్ప నుంచి పంపింగ్

ఎస్సారెస్పీ పరిధిలోని కాలువల్లో డీబీఎం- 38 పొడవు, ఆయకట్టులో గాని అతి పెద్దది. కాకతీయ ప్రధాన కాలువ నుంచి వరంగల్ జిల్లాలో ప్రారంభమయ్యే ఈ కాలువ గీసుకొండ, నల్లబెల్లి, ములుగు మండలంలోని మల్లంపల్లి, భూపాలపల్లి జిల్లాలోని గోరికొత్తపల్లి, రేగొండ, చిట్యాల, టేకుమట్ల మండలంలోని గ్రామాల మీదుగా మానేరు వరకు సుమారు 81.6 కిమీ వరకు ఉంది. ఈ కాలువ పరిధిలో సుమారు 80 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్నట్లు తెలిసింది. అయితే ప్రతి సంవత్సరం కాకతీయ ప్రధాన కాలువ నుంచి డీబీఎం- 38 ద్వారా సగం వరకు మాత్రమే ఎస్సారెస్పీ నీరు వస్తుండగా మిగతా సగం కాలువ పరిధిలో గల చివరి ఆయకట్టుకు రావడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు కూడా నిలిచిపోవడం వల్ల ఈ ఏడాది అసలు ఈ కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు నీరు రాలేదు. చివరి ఆయకట్టు అంతా భూపాలపల్లి నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఈ విషయాన్ని రైతులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో పరిష్కారం కోసం ఆయన సాగునీటిపారుదల రంగంలోని నిపుణులతో చర్చించారు. అయితే దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలో ఒకటైన రామప్ప బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ఎత్తిపోతలతో డీబీఎం-38 కాలువ ద్వారా చివరి ఆయకట్టుకు నిరందించవచ్చని నిపుణులు సూచించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలత రావడంతో డీపీఆర్ సిద్ధం చేయాలని సత్యనారాయణ రావు ఇరిగేషన్ ఇంజనీర్లకు చెప్పారు. దీంతో ఇటీవల ఇరిగేషన్ ఇంజనీర్లు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేశారు. రామప్ప బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ శిఖంలో పంపు హౌస్ నిర్మించి పైపులైన్ ద్వారా ఎత్తిపోతలతో సుమారు 12 కిలోమీటర్ల దూరంలో సుమారు 45 మీటర్ల ఎత్తులో గల డీబీఎం- 38 కాలువలోకి పంపింగ్ చేయడానికి రూ.290 కోట్లతో లైన్ ఎస్టిమేట్స్ రూపొందించారు. డీబీఎం- 38 కాలువలోకి 44.875 కిమీ వద్ద రామప్ప నుంచి ఎత్తిపోతల ద్వారా చేరుకునే దేవాదుల నీరు భూపాలపల్లి నియోజకవర్గం పరిధిలోని గోరికొత్తపల్లి, శాయంపేట, రేగొండ, చిట్యాల, టేకుమట్ల తదితర మండలాల్లోని సుమారు 44 వేలకు పైగా ఎకరాల ఆయకట్టుకు అందేలా అధికారులు ప్రతిపాదనలు చేశారు.

గణపసముద్రం నుంచి గ్రావిటీ ద్వారా...

భూపాలపల్లి నియోజకవర్గం పరిధిలోని గణపురం, భూపాలపల్లి మండలాలతోపాటు పొరుగున ఉన్న ములుగు నియోజకవర్గంలోని వెంకటాపురం మండలానికి చెందిన కొన్ని గ్రామాలకు ఏ సాగునీటి ప్రాజెక్టు ద్వారా నీరందకుండా సుమారు 30 వేల ఎకరాలకు పైగా గ్యాప్ ఆయకట్టు మిగిలి ఉన్నట్లు సాగునీటి శాఖ ఇంజనీర్లు గుర్తించారు. నీటి వసతి లేకపోవడం వల్ల ఈ గ్యాప్ ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గ్యాప్ ఆయకట్టుకు సాగునీరు అందించడానికి గల అవకాశాలపై నీటిపారుదల రంగంలోని నిపుణులతో పలు దఫాలు సమావేశమై చర్చించారు. చివరకు గణపసముద్రం నుంచి గ్రావిటీ ద్వారా కెనాల్ సిస్టంపై ఈ 30 వేలకుపైగా ఎకరాల గ్యాప్ ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గ్రీన్ సిగ్నల్ రావడంతో సత్యనారాయణరావు సూచనల మేరకు ఇరిగేషన్ ఇంజనీర్లు గణపసముద్రం నుంచి గ్యాప్ ఆయకట్టుకు గ్రావిటీ ద్వారా కెనాల్ సిస్టంపై సాగునీరు అందించడానికి సుమారు రూ.350 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారు. ప్రస్తుతం రామప్ప బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గణపసముద్రంలోకి ఫీడర్ ఛానల్ ద్వారా దేవాదుల నీరు చేరుతుంది. ఈ క్రమంలో గ్యాప్ ఆయకట్టుకు సరిపడా దేవాదుల నీటిని రామప్ప బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గణపసముద్రంలోకి విడుదల చేయడం ద్వారా కెనాల్ సిస్టం పై 30 వేలకు పైగా ఎకరాల గ్యాప్ ఆయకట్టుకు ప్రతి సంవత్సరం సాగునీరు ఇచ్చే విధంగా ఇరిగేషన్ ఇంజనీర్లు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ రెండు ప్రతిపాదనలను కూడా ఎమ్మెల్యే జీఎస్సార్ శుక్రవారం భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజ్ ని సందర్శించిన రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టులను చేపట్టేందుకు ఆయన సానుకూలత వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కూడా సానుకూలంగా ఉండటం వల్ల భూపాలపల్లి నియోజకవర్గంలో కొత్తగా ఈ రెండు సాగునీటి ప్రాజెక్టుల ప్రతిపాదనలకు త్వరలో ప్రభుత్వ నుంచి ఆమోదం లభించే అవకాశం ఉంది.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ప్రెస్ క్లబ్ సభ్యులు

రామోజీ రావుకు ప్రముఖుల నివాళి

అక్షర దర్బార్, హనుమకొండ: హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో శనివారం ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఈనాడు-ఈటీవీ పాత్రికేయులతో పాటు పలువురు జర్నలిస్టులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ మీడియా రంగంలో తనకంటూ ప్రత్యేక ఒరవడిని సృష్టించిన వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. తాను నమ్ముకున్న సిద్ధాంతాలకు కట్టుబడి ఎన్ని అవరోధాలు వచ్చినా ఎదుర్కొని గెలిచి, నిలిచిన వ్యక్తి మరణించటం తెలుగు రాష్ట్రాల ప్రజలకు, యావత్ దేశానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, జర్నలిస్టు సంఘం నేతలు బీఆర్ లెనిన్, తోట సుధాకర్ పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీలో అదనంగా 65 కొత్త చికిత్సలు

1375 పాత చికిత్స విధానాలకు నగదు ప్యాకేజీ పెంపు

అక్షర దర్బార్, హైదరాబాద్: రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుముక వంటి ఖరీదైన వ్యాధులకు చికిత్స, ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరోగ్యశ్రీ పథకంలోని చికిత్సల ప్యాకేజీ ధరలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నారు. వీటికి సంబంధించి రూ.497.29 కోట్లు అవసరం కాగా శనివారం ఈ నిధులను విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రస్తుతం 1672 చికిత్సా విధానాలు అందుబాటులో వున్నాయి. ఇందులో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ఆరోగ్య శ్రీలో అమలులో లేని యాంజియోగ్రామ్, పార్కిన్ సన్, వెన్నుపూసకు సంబంధించిన 65 అధునాతన చికిత్స విధానాలను ఇకనుంచి ఆరోగ్యశ్రీలో అమలు చేయాలని నిర్ణయించారు. వీటికి తోడు ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ లో ఉన్న 98 చికిత్సా విధానాలు రాజు ఆరోగ్యశ్రీలో చేర్చడం వల్ల దాదాపు 189.83 కోట్ల ఖర్చు ప్రభుత్వం పై పడనుంది. అంతే కాక, 65 కొత్త చికిత్సా విధానాలు అంగీకరించడం వల్ల ప్రభుత్వం 158.20 కోట్ల ఖర్చు చేయనుంది. పై సవరణలు, కొత్త చికిత్సా విధానాల కోసం ప్రభుత్వం అదనంగా రూ 497.29 కోట్లు ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంజూరు చేశారు.

రామోజీ రావు అస్తమయం

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రులు
- అధికార లాంచనాలతో ఆదివారం అంత్యక్రియలు

అక్షర దర్బార్, హైదరాబాద్: ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతిచెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 3:45 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. ఈనెల 5న గుండె సమస్యలతో ఆయనకు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. దీంతో హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం గుండెకు స్టెంట్ వేశారు. అనంతరం ఐసీయూలో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్సపొందుతూ మృతిచెందారు. ఆయన పార్థివ దేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. 1936 నవంబర్ 16న ఏపీలోని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో రామోజీరావు జన్మించారు. 1974 ఆగస్టు 10న విశాఖ తీరంలో 'ఈనాడు' దినపత్రికను ప్రారంభించారు. రామోజీరావుకు సినీ, రాజకీయ, ఇతర రంగాల ప్రముఖుల నివాళులు అర్పించారు. ఆదివారం ఉదయం 9-10 గంటల మధ్య ఫిల్మ్‌సిటీలో రామోజీరావు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అధికారలాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రామోజీరావు మృతి పట్ల నరేంద్ర మోడీ సంతాపం వ్యక్తం చేశారు. రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది.. మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడు రామోజీ.. పత్రికారంగంలో సరికొత్త ప్రమాణాలు నెలకొల్పారు.. పత్రిక, సినీ, వ్యాపార రంగాలపై చెరగని ముద్ర వేశారు అని నరేంద్ర మోడీ కొనియాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్థివదేహాన్ని సందర్శించింది నివాళులర్పించారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, అన్ని రాజకీయ పార్టీల నేతలు, సినీ, వ్యాపార రంగ ప్రముఖులు పెద్ద ఎత్తున ఫిలిం సిటీకి తరలివచ్చి నివాళులర్పించారు.



నలుగురు వ్యవసాయ అధికారుల సస్పెన్షన్

- పచ్చిరొట్ట విత్తనాల బ్లాక్ మార్కెటింగ్ కు తెగబడ్డ అధికారులు
- ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ శాఖ కమిషనర్

అక్షర దర్బార్, హైదరాబాద్: పచ్చిరొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడిన నలుగురు వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రురు మండల వ్యవసాయ అధికారితో పాటు మరో ముగ్గురు వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏ.ఈ.ఓ) సస్పెండ్ చేశారు. రైతు వ్యతిరేక చర్యలకు గానీ, పంట విత్తనాలను బ్లాక్ మార్కెటింగ్ చేసినా, కల్తీ విత్తనాలను అమ్మే ఎంతపెద్ద వారినైనా వదలవద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల స్పష్టమైన ఆదేశాలను ఇవ్వడంతో తొర్రురు మండలంలో పచ్చిరొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెట్ ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలింపునకు కారణమైన తొర్రురు మండలం వ్యవసాయాధికారి కె. సోమకుమార్ యాదవ్, తొర్రురు క్లస్టర్ గ్రేడ్ -2 ఏ.ఈ.ఓ. ఎం. జమున, అమ్మాపురం క్లస్టర్ ఏఈవో అజ్మీరా దీపిక, హరిపిరాల ఏఈవో సి.హెచ్. అరవింద్ లను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి ఉత్తర్వులు జారీచేశారు. తొర్రురు మండలంలో పచ్చి రొట్ట విత్తనాలు అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడుతున్నారని వచ్చిన వార్తలపై విచారించాల్సిందిగా మరిపెడ మండలం అసిస్టెంట్ డైరెక్టర్ ను విచారణాధికారిగా వ్యవసాయశాఖ కమిషనర్ నియమించారు. దీంతో, విచారణ చేసిన మరిపెడ ఏ.ఈ. తొర్రురు మండలంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో పెద్ద ఎత్తున అవకతవకలున్నాయని నివేదిక సమర్పించారు. ప్రధానంగా తొర్రురు మండల వ్యవసాయాధికారి కె. సోమకుమార్ యాదవ్ కు చెందిన ఓఎస్ఎస్డీఎస్ పోర్టల్ లాగిన్ ను నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు ఏఈవో లకు ఇవ్వడంతో దీనిని దుర్వినియోగ పరచిన ఆ ముగ్గురు ఏఈఓలు పచ్చిరొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెట్ కు తరలించారని తన నివేదికలో ఏడీ పేర్కొన్నారు. దీనితో తొర్రురు మండలం వ్యవసాయాధికారి కె. సోమకుమార్ యాదవ్, తొర్రురు క్లస్టర్ గ్రేడ్ -2 ఏ.ఈ.ఓ. ఎం. జమున, అమ్మాపురం క్లస్టర్ ఏఈవో అజ్మీరా దీపిక, హరిపిరాల ఏఈవో సి.హెచ్. అరవింద్ లను సస్పెండ్ చేస్తూ వ్యవసాయ కమిషనర్ బి. గోపి ఉత్తర్వులు జారీ చేశారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న పోలీసులు

అభినందించిన డీఎస్పీ సంపత్ రావు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : మున్సిపల్ ఉద్యోగి హత్య కేసును 24 గంటల్లో పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పంగ రమేష్ అనే వ్యక్తి భూపాలపల్లి మున్సిపల్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడు తన భార్య, ఇద్దరు పిల్లలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాంనగర్ లో నివాసం ఉంటున్నాడు. గతంలో రమేష్ అనారోగ్యంగా ఉన్న సమయంలో తన దగ్గరి బంధువైన వరుసకు సడ్డకుడు దొంత మల్లేష్ దగ్గర రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అందులో కొంత తిరిగి ఇవ్వగా మిగతా డబ్బుల గురించి మల్లేష్ పదేపదే రమేష్ నీ ఇబ్బందిపెట్టగా తన వద్ద లేవని జాప్యం చేశాడు. ఈనెల 6న మృతుడు రమేష్ తన అత్తగారి ఊరైన సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికి వెళ్లగా అక్కడ తన సడ్డకుడు మల్లేష్, అతడి కొడుకు నాగరాజు ఇద్దరు డబ్బుల విషయంలో రమేష్ తో గొడవ పడ్డారు. తర్వాత రమేష్ అక్కడి నుండి బయలుదేరి భూపాలపల్లికి వచ్చేశాడు. ఈ క్రమంలో బాకీ డబ్బులు ఇవ్వడం లేదని దొంత మల్లేష్ , కొడుకు నాగరాజు పథకం ప్రకారం రమేష్ హత్య చేసేందుకు పథకం రచించారు. ఈ క్రమంలోనే అదేరోజు రాత్రి భూపాలపల్లికి వచ్చి మరొక బంధువు దండు జితేందర్ అనే వ్యక్తిని కలుపుకొని ముగ్గురు కలిసి అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో రమేష్ ఇంట్లోకి చొరబడి రమేష్ దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రమేష్ అక్కడికక్కడే మరణించాడు. దీంతో అక్కడ ఎలాంటి ఆధారాలు ఉండకూడదని గదులన్నింటిని శుభ్రం చేసి అక్కడి నుండి పారిపోయారు. ఘటనపై రమేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా ముగ్గురు నిందితులను శనివారం ఉదయం అదుపులో తీసుకొని తీసుకున్నట్లు భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు తెలిపారు. ఈ కేసుని త్వరితగతిన ఛేదించిన చిట్యాల సీఐ మల్లేశ్, ఎస్సై ప్రసాద్, పోలీస్ సిబ్బంది వెంకటరెడ్డి, సతీష్, సురేష్, విజేందర్, అశోక్, చంద్రశేకర్ ను డీఎస్పీ అభినందించారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సంపత్ రావు

పీడీఎస్ బియ్యం పట్టివేత

- హసన్ పర్తి మండలంలోని వంగపల్లి వద్ద ఘటన

అక్షర దర్బార్, హసన్ పర్తి: హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని వంగపల్లి గ్రామం వద్ద ఓ డంపులో అక్రమంగా నిలువ ఉన్న 80 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు కలిసి పట్టుకున్నారు. నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన బండి కుమార్ ఈ బియ్యాన్ని అక్రమంగా డంపులో నిలువ చేసినట్లు గుర్తించారు. ఈ బియ్యం విలువ రూ.2.21 లక్షలుగా ప్రకటించారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్ స్పెక్టర్ ఎస్ రవికుమార్, ఎస్సై బి శరత్, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠా అరెస్టు

- భారీ స్థాయిలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- రూ.50 లక్షల గంజాయి, కారు, మూడు ఫోన్లు స్వాధీనం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: భారీ స్థాయిలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్, దామెర పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వీరి నుండి సుమారు రూ.50 లక్షల విలువ గల 192 కిలోల గంజాయితో పాటు కారు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడిస్తూ.. నిందితుడు గజ్జి సహదేవ్ కారుడ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన మిగితా నిందితులతో కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా కొంతకాలంగా ఏపీలోని చింతూరు మండలం, తునగొండ గ్రామం నుండి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రహస్యంగా తరలించి గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఇదే తరహాలో గజ్జి సహదేవ్ మిగితా నిందితులతో కలిసి తునుగొండలో 192 కిలోల గంజాయిని కొనుగోలు చేసి దానిని రెండుకిలోల చొప్పున 96 ప్యాకెట్ల లో ప్యాక్ చేసి కారులో ఎవరికి అనుమానం రాకుండా భద్రపర్చి చింతూరు నుండి ఏటూరునాగారం, ములుగు మీదుగా మహారాష్ట్రకు నిందితులు కారులో గంజాయిని తరలిస్తున్నట్లుగా పోలీసులకు పట్టుబడ్డారు. నిందితులు కారులో తప్పించుకుని పారిపోయే క్రమంలో పోలీసులు కారును అడ్డగించి తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లను గుర్తించి

గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుల్లో భూపాల పల్లి జిల్లా గోరి కొత్తపల్లికి చెందిన గజ్జి సహదేవ్, మహారాష్ట్ర షిరిడీ ఆహ్మద్‌నగర్ సోమన్మెర్ కు చెందిన జై యోగేశ్వర్, మహారాష్ట్ర బీడ్ జిల్లా కలాట్ వాడికి చెందిన సోమనదత్ రాందాస్ కాలాటి ఉన్నారు. ఒరిస్సా కూరమనూర్ కు చెందిన పాండు, మహారాష్ట్ర పంచవటికి చెందిన లక్ష్మీ తాటే, వికాస్ తాటే పరారీలో ఉన్నారు.కాగా, గజ్జి సహదేవ్‌పై గతంలో హనుమకొండ, ఏనుకూ రు, పర్కాల పోలీస్ స్టేషన్లలో గంజాయి స్మగ్లింగ్ చేస్తుండగా ప ట్టుబడ్డ కేసులు నమోదుకాబడ్డాయి. ఈ ముఠా సభ్యులను అరెస్టు, గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫో ర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్స్పెక్టర్లు సార్లరాజు, ఎస్.రవికుమార్, ఎస్సెలు నిస్సార్ పాషా, శరత్‌కుమార్, దామెర ఎస్సై అశోక్, ఏవీవో సల్మాన్ పాషా, టాస్క్ ఫోర్స్ హెడ్‌కానిస్టేబుళ్ళు అశోక్, కృష్ణ, కానిస్టేబుళ్ళు సురేష్, శ్రీనివాస్, అంజయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్, అఫ్జ ల్‌ఖాన్, సతీష్, నాగరాజులను పోలీస్ కమిషనర్ అభినందించారు.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

అ'పూర్వ' సమ్మేళనం..

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని సీఎస్ఐ మిషన్ హైస్కూల్లో 1979– 80 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం సీఎస్ఐ మిషన్ పాఠశాలలో ఘనంగా జరిగింది. దాదాపు 44 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించారు. హెచ్ఎం కెజే థామస్, ఉపాధ్యాయుడు నరసింహారావును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు విన్సెంట్ విజయ్ కుమార్, జి.శ్రీనివాస్ రూపీ, డి. రవికుమార్, ఎంఎన్ మూర్తి, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.సురేష్ కుమార్, పి.రామారావు, బి.ప్రేమ్ సాగర్, బి. ఆనందరావు, ఎం.స్వరూప, పి.కృప, ఏం.సుగుణ, ఆర్.ఎస్తేర్, ఎం.విమల, బి.వజ్ర తదితరులు పాల్గొన్నారు.

'మృగశిర' సందడి

కిటకిటలాడిన చేపల మార్కెట్లు

ధర ఎంతున్నా కొనుగోలు చేసిన ప్రజలు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి/ నర్సంపేట : మృగశిర కార్తెను పురస్కరించుకుని శనివారం చేపల కొనుగోళ్లతో జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో సందడి నెలకొంది. డిమాండ్ కు అనుగుణంగా వ్యాపారులు సైతం పెద్ద మొత్తంలో చేపలను దిగుమతి చేసుకుని అమ్మకాలను చేపట్టారు. మృగశిర రోజున చేపల కూరతో భోజనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే మృగశిర వచ్చిందంటే చాలు ఇంట్లో చేపల ఘుమఘుమలు గుప్పుమంటాయి. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం అధికంగా ధరలు పలికాయని, సుమారుగా భూపాలపల్లి జిల్లాలో 80 నుంచి 100 టన్నుల చేపల విక్రయాలు జరిగినట్లు వ్యాపారులు తెలిపారు. నర్సంపేటలో కోటగండి మైసమ్మ ఆలయంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్ రావు, నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య, కాంగ్రెస్ నాయకులు దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఎడ్లపల్లిలో తాగునీటికి కటకట

ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

తక్షణమే నీటి సరఫరా చేయాలని వేడుకోలు

అక్షర దర్బార్, మల్హర్ : మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో గత రెండు మూడు రోజులుగా తాగునీటి ఎద్దడి ఏర్పడిందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న బోర్ మోటార్ నీరు అం దక, మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని శనివారం మహిళలు ఖాళీ బిందెలు, బకెట్లతో రోడ్డుపై ఆందోళన చేపట్టారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని లేదంటే ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు

జిల్లాలో 17 కేంద్రాలు ఏర్పాటు

వివరాలు వెల్లడించిన కలెక్టర్

కలెక్టర్ భవేశ్ మిశ్రా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్ హాజరు ఇవ్వాలని ఆయన సూచించారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 17 కేంద్రాలు ఏర్పాటు చేశామని 4,473 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, ఉదయం 9 గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీడబ్ల్యూసీ సమావేశాలకు రేవంత్ రెడ్డి

అక్షర దర్బార్, హైదరాబాద్: సీడబ్ల్యూసీ సమావేశాలకు హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి, పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లను సీఎం మర్యాద పూర్వకంగా కలిసారు.

రాహుల్ గాంధీని సన్మానిస్తున్న సీఎం రేవంత్

అధునాతన పద్ధతిలో దివ్యాంగులకు విద్యాబోధన

భవిత కేంద్రం ఉపాధ్యాయుడు శ్రీకాంతాచారి

అక్షర దర్బార్, మేడ్చల్ /కాప్రా /జవహర్ నగర్ : దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అధునాతన పద్ధతిలో విద్యాబోధన అందిస్తున్నామని, సకలాంగుల పిల్లలకు దీటుగా దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని భవిత కేంద్ర ఉపాధ్యాయుడు శ్రీకాంతాచారి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో జవహర్ నగర్ కార్పొరేషన్ లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంతచారి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు పాఠశాలకు వెళ్లేనే మానసికంగా ఎదుగుతారని, ప్రభుత్వం దివ్యాంగుల కోసం సకల వసతులు కల్పిస్తు

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు శ్రీకాంతాచారి

దని, బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణ బాబు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : కేసుల్లో ఇరుక్కొని పోలీసు స్టేషన్, కోర్టుల చుట్టూ తిరిగితే జీవితంలో విలువైన సమయం, డబ్బు కోల్పోయి మానసికంగా ఇబ్బంది పడుతామని, ఒకరితో ఒకరు రాజీ కుదుర్చుకుంటే స్నేహ పూర్వకంగా ఉంటే ప్రశాంతంగా జీవించవచ్చని భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నారాయణ బాబు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఒక్కరోజే 815 కేసులు పరిష్కారమయ్యాయి. మరికొన్ని కేసులు పరిష్కారం కానున్నాయి. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కె.జయరాం రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.రామచంద్ర రావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్ ప్రవేశాలు ప్రారంభం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీ, ఇతర ఇంజనీరింగ్ కళాశాలలో నేరుగా బీటెక్ రెండవ సంవత్సరములో ప్రవేశం కోసం పాలిటెక్నిక్ డిప్లొమా చదివిన వారికి నిర్వహించిన ఈసెట్–2024 లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 2024–25 సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ తెలంగాణ ఉన్నత విద్య మండలి ఈ నెల 8 వ తేదీ నుండి చేపట్టనుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఈ కౌన్సిలింగ్ లో భాగంగా వరంగల్ జిల్లా కేంద్రంలో గవర్నమెంట్ వరంగల్ పాలిటెక్నిక్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ నందు విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కొరకు ఈ నెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు స్లాట్ బుక్ చేసుకోవచ్చు అని, స్లాట్ బుక్ చేసుకొన్న విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 10 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు జరుగుతుంది అని వరంగల్ జిల్లా హెల్ప్ లైన్ సెంటర్ క్యాంపు ఆఫీసర్ డా. బైరి ప్రభాకర్ గారు తెలిపారు. విద్యార్థులు తమతో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీ తీసుకొని రావలసి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 10 వ తేదీ నుండి 14 వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవచ్చు. ఈ నెల 18వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

అక్షర దర్బార్, మేడ్చల్ /కాప్రా /జవహర్ నగర్ : గుడికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్ళిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ వో నాగరాజు వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ ప్రాంతంలో జెట్టి లక్ష్మి తన నలుగురు పిల్లలతో కలిసి నివాసముంటోంది. పెద్ద కుమార్తె అనురాధ ఇంట్లోనే

కుట్టుపని నేర్చుకుంటుంది. రోజువారీ పనుల నిమిత్తం తల్లి జెట్టి లక్ష్మి వెళ్ళింది. ఈ నెల 7న అనురాధ(21) గుడికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో అనురాధ ఆచూకీ కోసం ఎంత వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.